క్లుప్తంగా

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: రైజింగ్ నాలెడ్జి ఆధ్వర్యంలో అమరావతి ఇంటర్ నేషనల్ పాఠశాలల్లో అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయి పరీక్షా పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన విద్యార్థులకు అమరావతి ఇంటర్ నేషనల్ పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, మిల్టన్ పాఠశాల వెంకటేష్, రైజింగ్ నాలెడ్జి ఎండీ రవింద్ర రాజు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

ఆటలతో మానసిక ఉల్లాసం



మ్యూజికల్ చైర్ ఆట ఆడుతున్న విద్యార్థుల తల్లులు

ఆదోని సెంట్రల్: ఆటలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మిల్టన్ గ్రామర్ పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ఆదివారం ఆటల పోటీలను నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థుల తల్లులు ఈ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. వివిధ ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి పాఠశాల, ఇన్‌చార్జ్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేసుకుందాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పని చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు సూచించారు. ఆదివారం పట్టణంలోని 1వ వార్డులో పార్టీ పట్టణ అధ్యక్షుడు 1వ వార్డు కౌన్సిలర్ కామర్తి నాగేశప్ప అధ్యక్షతన పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు

గోనెగండ్ల : మండలంలో ఎక్కడైన మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బహిరంగంగా రోడ్డు పక్కన కూర్చొని మద్యం సేవిస్తే కేసులు నమోదు చేసి కోర్టుకు పంపడం జరుగుతుందన్నారు. మండలంలోని గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి ఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం అందివ్వాలని ప్రజలకు సూచించారు.

వైటీపీఎల్‌ను నిలిపివేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో క్రికెట్ బెట్టింగ్‌ను ప్రోత్సహించేలా ప్రారంభించిన వైటీపీఎల్ క్రికెట్ పోటీలను వెంటనే నిలిపివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వైటీపీఎల్ క్రికెట్‌తో యువత, విద్యార్థులు బెట్టింగ్‌తో ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పరీక్షల సీజన్ కావడంతో విద్యార్థుల్లో చదువుల పట్ల ఆసక్తి తగ్గిపోతుందన్నారు. విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో వైటీపీఎల్ పేరుతో క్రికెట్ టోర్నీ నిర్వహించడం శోచనీయమన్నారు.

అవగాహన సదస్సులు నిర్వహించండి



డీఎస్పీ హేమలతకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న రవి

ఆదోని అర్బన్: ఆదోని డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు పెరుగుతున్నాయని, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదోని డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎరుకుల రవికుమార్ కోరారు. ఆదివారం ఆదోని డీఎస్పీ హేమలతను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన ఘటనల గురించి వివరించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు వేగవంతంగా విచారణ చేయాలని కోరారు.

సంకల్ప యజ్ఞం..
ప్రగతి మంత్రం

- నాలుగేళ్లలో ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ రూపురేఖల మార్పు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, భక్తుల సహకారంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- పాతుకుపోయిన ఆక్రమణల తొలగింపు
- వెల్లివిరుస్తున్న భక్తుల హర్షం



ఉరకుంద ఈరన్న స్వామి ఆలయం ఏరియల్ వ్యూ

మంత్రాలయం : సంకల్పం గట్టిదైతే అసాధ్యం సుసాధ్యమే. అచ్చం అలాంటి సంకల్పమే సిద్ధయోగి ఉరకుంద ఈరన్న క్షేత్రంలో యజ్ఞమైంది. ప్రగతి మంత్రమై ఘోషించింది. సుందర కట్టడాలతో ఈరన్న సౌరభం ఖ్యాతికి మూలమైంది. గత ప్రభుత్వ సహకారం.. భక్తుల దాతృత్వం.. క్షేత్ర మహర్దశకు బీజమైంది. సంకల్పం ముందు రాజకీయం చేతులు కట్టుకుంది. పాతుకుపోయిన ఆక్రమణలు తట్టాబుట్ట సర్దుకున్నాయి. సుందర కట్టడాలు.. ఆక్రమణల తొలగింపుతో సువిశాల అవనిపై ఈరన్న సోయగం ఉట్టిపడుతోంది. ఉరుకుంద క్షేత్రంలో బృహత్తర కార్యాలు సఫలీకృతం కావడంతో భక్తులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధికి బీజం

మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం మండల కేంద్రానికి తూర్పు దిశన 6 కి.మీ. దూరంలో ఉరకుంద ఈరన్న క్షేత్రం ఉంది. జిల్లా విభజనతో కర్నూలులో ఉన్న ఏకైక డిప్యూటీ హోదా ఉన్నది ఈ క్షేత్రం ఒక్కటే. గత ప్రభుత్వం డిప్యూటీ కమిషనర్ హోదా కల్పిస్తూ క్షేత్రంలో పలు పనులకు సహకారంగా నిలిచింది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా క్షేత్రంలో 4 రాజగోపురాలు, మహాప్రాకారం, ప్రాకారంలో బండపరుపునకు అనుమతులు ఇచ్చింది. రూ.9.70 కోట్లతో రాజగోపురాలు, రూ.4.60 కోట్లతో మహాప్రాకారం, రూ. 1.26 కోట్లతో మహాప్రాకారంలో బండపరుపు, రూ.50 లక్షలతో శాశ్వత దర్శన క్యూలైన్, రూ.49 లక్షలతో క్యూలైన్ షెడ్ ఏర్పాటు చేశారు. అప్పటి ఆలయ ఈఓ శ్రీవాణి నేతృత్వంలో శరవేగంగానే పనులు పూర్తి చేయడం జరిగింది. ప్రస్తుత ఈఓ మేడేపల్లి విజయరాజు నేతృత్వంలో రాజగోపురాలకు భక్తుల సహకారంతో రంగులు వేయించారు. అలాగే దర్శన క్యూలైన్ అనుకుని ఇటుకలతో ప్లాట్‌ఫాం నిర్మించారు. క్షేత్రంలో ఐమ్యాక్స్ బల్బులు, 650 దేవతా వృక్షాలు, రెండు భక్తుల విడది షెడ్లు, భక్తుల డార్మిటరీ, ట్రాఫిక్ నియంత్రణకు స్టాఫర్ల ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఈనెల 2 నుంచి తొలి కుంభాభిషేకం కార్యక్రమం చేపట్టారు.



భక్తుల కోసం నిర్మాణంలో ఉన్న డార్మిటరీ

తొలగిన ఆక్రమణలు

క్షేత్రంలో రాజకీయ జోక్యంతో తరాలుగా ఆక్రమణలు తిష్టవేశాయి. క్షేత్రానికి అభిముఖంగా టెంకాయల కొట్లు, ఆదోని రోడ్డులో కిరాణ, బొమ్మలు, మిఠాయి, హోటళ్లు ఆలయ స్థలంలో వేసుకుని దర్జాను ప్రదర్శించారు. ఆలయం చుట్టూరా వ్యాపార కొట్లు ఉండటంతో భక్తులు సైతం తలలు పట్టుకునే పరిస్థితి. గతంలో ఈఓలు ఆక్రమణలు తొలగించేందుకు సర్వ ప్రయత్నాలు చేసి విఫలం అయ్యాయి. ప్రస్తుత ఈఓ మాత్రం చతురతతో ఆక్రమణల తొలగింపులో సఫలీకృతులయ్యారు. క్షేత్రం ప్రగతి పనులకు మేకులా ఉన్న ఆక్రమణలు తొలగించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆక్రమణల తొలగింపుతో భక్తులు ఎంతగానో సంతోషిస్తున్నారు.

భక్తుల సహకారంతోనే సాధ్యం



ఈరన్న స్వామి అనుగ్రహంతో ఎంతో మంది భక్తులు విరివిగా స్వామి సేవలో తరిస్తున్నారు. తోచిన సహకారం అందించడంతో క్షేత్రంలో చాలా బృహత్తర కార్యాలు జరిగాయి. భక్తుల మనోభావాలకు అనుగుణంగా క్షేత్రాన్ని తీర్చిదిద్దాలని సంకల్పం పెట్టుకున్నాం. మరో 11 పనులను క్షేత్రంలో పూర్తి చేయాలని యత్నిస్తున్నాం. సదరు పనులు పూర్తయితే క్షేత్రంలో భక్తులకు దాదాపుగా ఇక్కట్లు ఉండవని భావిస్తున్నాం. భక్తులు సహకారం అందిస్తే పనులను సుసాధ్యం చేస్తాం.

– మేడేపల్లి విజయరాజు,
ఆలయ డిప్యూటీ కమిషనర్

ముందున్న సంకల్పం

క్షేత్రం దశదిశల మార్చేందుకు మరిన్ని పనులు చేయాలని ఆలయ అధికారులు సంకల్పంగా పెట్టుకున్నారు. ముఖ్యంగా తిరుమల వేంకన్న క్షేత్రం తరహాలో సువిశాల మాడవీధుల ఏర్పాటు చేయాలని తలంచారు. నూతనంగా భక్తుల కోసం 120 గదులతో మూడు అంతస్తుల సముదాయం నిర్మించనున్నారు. అభిషేక మంటపం, బసవన్న, ఆంజనేయస్వామి ఆలయాల పునఃనిర్మాణం, నిత్యాన్నదాన కాంప్లెక్స్, పాకశాల, లడ్డూ పోటుకు ప్రత్యేక భవనం, ప్రయాసల్లేని దర్శన క్యూలైన్, తూర్పు రాజగోపురం ముందు భాగంలో ముఖ మంటపం, లాకర్లతో కూడిన డార్మిటరీ, తాగునీటి కోసం ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించాలని ఆశయంగా పెట్టుకున్నారు. భక్తులు సహకారం అందిస్తే మొత్తం 11 బృహత్తర పనులు పూర్తి చేయాలని సంకల్పించారు.

స్నేహితుల కుటుంబాలకు తోడుగా..



రంగస్వామి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేసి తోడుగా ఉంటామని భరోసా కల్పించారు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 2005 – 06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. తమతో పాటు చదువుకొన్న శ్రీనివాసులు, రంగస్వామి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాలకు తోడుగా ఉండాలని నిశ్చయించుకున్నారు. తలా ఓ చేయి వేసి డబ్బు పోగుచేశారు. శ్రీనివాసులు భార్య లక్ష్మి, వారి కుటుంబాన్ని కలసి పరామర్శించి రూ. 16,000 నగదు, నిత్యావసర సరుకులు చేశారు. అదేవిధంగా ఈ మధ్యనే ఆత్మహత్య చేసుకున్న రంగస్వామి తల్లి ఈరమ్మ, కుటుంబాన్ని కలసి వారిని పరామర్శించి నిత్యావసర సరుకులతో పాటు రూ.16,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పలువురు మిత్రులు మాట్లాడుతూ.. తోటి మిత్రులు, వారి కుటుంబాలు ఇబ్బందులో ఉన్నారని తమ దృష్టికి తీసుకొస్తే వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సంస్కరణల పేరుతో ప్రాథమిక పాఠశాలల నిర్వీర్యం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తోందని ఎస్టీయూ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు మహాదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న అన్నారు. ఎస్టీయూ కార్యాలయంలో ఆదోని, కౌతాళం ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. వారు మాట్లాడుతూ జీఓ నంబర్.117 రద్దు పేరుతో గ్రామ స్థాయిలోని అన్ని పాఠశాలలను ఒకే పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. ఆదర్శ, ఫౌండేషన్ పాఠశాలల పేరుతో 2 కిలో మీటరు దూరంలో ఉన్న పాఠశాలలను విలీనం చేయడం విద్యార్థుల పాలిట శాపంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్, నాయకులు రామాంజినేయులు, సుధాకర్ బాబు, రామాంజినేయులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల విలీనం నిలిపివేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆదర్శ ప్రాథమిక పాఠశాలల పేరుతో ఆయా పాఠశాలల వీలీన ప్రక్రియను ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 60 మంది విద్యార్థులున్న ప్రైమరీ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు 40 నుంచి 45 మంది విద్యార్థులున్న సమీప పాఠశాలలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, బాబయ్య, ఎల్లప్ప, లక్ష్మీనారాయణ, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పారా లీగల్ వలంటీర్స్(పీఎల్‌వీ)ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వలంటీర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జిల్లా వాసులై వుండాలని, సామాజిక సేవ, చట్టంపై అవగాహన, ప్రజా సంక్షేమానికి అంకిత భావంతో పనిచేసే ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి, హైస్థాయి విద్యార్హతలతో పాటు చట్ట, సామాజిక సేవారంగంలో పరిజ్ఞానం వున్న వారికి ప్రాధాన్యత వుంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, ఎమ్మిగనూరు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి పొందవచ్చని సూచించారు. పూరించిన దరఖాస్తులను 5వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా సమర్పించాలన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రావణిరెడ్డి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రావణిరెడ్డి హెచ్చరించారు. ఆదివారం నిజాముద్దీన్ కలనీలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతి నిరుపేద కుటుంబానికి పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇస్తానని చెప్పి, ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలకు నివాస గృహాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సాయిపోగు కోటమ్మ, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఏఐవైఎఫ్ పట్టణాధ్యక్షులు బసాపురం లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఆందోళన

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 5న ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి విజయ్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఆందోళన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు శివ, నరసింహగౌడ్, వీరాంజినేయులు, ఖాజ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కూటమి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

నందవరం : అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం రైతులను నట్టేముంచిందని ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రైతు విభాగపు అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో ఆయన స్వగ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి పాలనలో రైతులను మభ్యపెట్టడం తప్ప చేసిందేమీ లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ఇంత వరకు అమలు చేయకపోగా, నిధులు లేవని చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి అటు ప్రజలనూ, ఇట్టు రైతులను మోసం చేశారని విమర్శించారు. రైతులకు తక్షణమే అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు పెట్టుబడిసాయం అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కరరెడ్డి, పురుషోత్తం రెడ్డి, బ్రహ్మయ్య, రాఘవరెడ్డి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా వైఎస్సార్‌సీపీ

- 'ఫీజు పోరు'ను విజయవంతం చేయండి
- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- పోస్టర్ల ఆవిష్కరణ



ఫీజు పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: విద్యార్థులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఫీజు బకాయిలపై ఈనెల 5వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆదివారం తన నివాసంలో ఫీజు పోరు పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుకు సంబంధించిన రూ.3 వేల కోట్లు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా జగనన్న పాలనా విధానాలను అమలు చేశారని, అయితే నేడు చంద్రబాబునాయుడు హామీలను విస్మరిస్తూ విధానాలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్‌తో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆరోపించారు.

పేదల సంక్షేమమే లక్ష్యం జగనన్న పాలన

పేదల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే అన్నారు. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. నేడు చంద్రబాబు సంక్షేమ పథకాలకు మంగళం పాడారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఈనెల 5వ తేదీన కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, రామలింగేశ్వరయాదవ్, బాలాజీ, రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, రమేష్, రామాంజినేయులు, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపస్ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయుఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘం నాయకులు ఘనంగా జరపుకున్నారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవేంద్రనాథ్ రెడ్డి, భైరప్ప ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు తాయప్ప ముందుగా అహల్యాబాయ్ హోల్కర్ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ నాయకులు రామకృష్ణ, జ్ఞానేశ్వర్ రావు, రమేష్ రావు, అనిల్ కుమార్మాజీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉపయోగపడని కేంద్ర బడ్జెట్

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పేదలకు ఏమాత్రం ఉపయోగపడే విధంగా లేదని భారత రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ఏసేపు ఆరోపించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు గడిచినా విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నాయకులు లక్ష్మన్న, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వలేదు

ఆదోని సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఎంప్లాయీస్ జాతీయ కార్యదర్శి రవిశంకర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల సబ్ ప్లాన్ ప్రకారం జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి తగిన నిధులను కేటాయించాల్సి ఉందన్నారు. కేవలం ఎస్సీలకు రూ. 15వేల కోట్లు, ఎస్టీలకు రూ. 15వేల కోట్లు నిధులను మాత్రమే కేటాయించందన్నారు. కనీసం రూ.13 లక్షల కోట్లు అవసరమవుతాయన్నారు. కనీసం మార్చిలో రివైజ్ చేసే బడ్జెట్లోనైనా ఎస్సీ, ఎస్టీలకు తగిన న్యాయం చేయాలని వారు కోరారు.

ఘనంగా మర్రిస్వామి పల్లకోత్సవం



కలశాలతో వస్తున్న చిన్నారులు, మహిళలు,



పల్లకీలో ఊరేగుతున్న మర్రి స్వామి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన కృష్ణావధూత స్వామి 50వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆర్లబండ మఠం మఠాధిపతులు మర్రిస్వామితాత పల్లకీ మహోత్సవం ఆదివారం మండల కేంద్రమైన కౌతాళంలో ఘనంగా జరిగింది. మహిళలు కలశాలతో తరలిరాగా మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య పల్లకీ మహోత్సవం గ్రామ పురవీధులగుండా సాగింది. యువకుల కోలాటలు, చిన్నారుల నృత్య విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. తెల్లవారు జామున కృష్ణవధూత స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవాలను ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ప్రతి రోజు రాత్రి భగవద్గీత పారాయణం చేశారు. ఉదయం స్వామి ఆధ్వర్యంలో 8 జంటలకు సామూహిక వివాహలను జరిపించారు. కార్యక్రమంలో పూజారి లింగ, అయ్యప్ప, గురుస్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

వధువులకు తాళి, ముక్కుపుడక విరాళం

కృష్ణావధూత ఆశ్రమంలో జరిగిన సామూహిక వివాహలకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ప్రహ్లాదాచారి వధువులకు తాళి, ముక్కుపుడక, మెట్టెలు బహూకరించారు. నూతన వధువరులకు ఆశ్వీర్వాదించారు. ఆయన వెంట సర్పంచ్, ఉప సర్పంచ్‌లు పాల్ దినకర్, తిక్కయ్య, నాయకులు సత్యప్పస్వామి, వడ్డె రాము, ఆంజి, అబ్దుల్ సమద్ మాజీ సర్పంచ్ అవతారం పాల్గొన్నారు.

తులాభారం : రాత్రి మర్రిస్వామికి ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప తులభారం నిర్వహించారు గత 17సంవత్సరాల నుంచి తాతకు తులభారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్పొరేట్ శక్తుల కోసమే కేంద్ర బడ్జెట్

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా వుందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యం అంటూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంపన్నులకు మేలు చేసేలా వుందన్నారు. సామాన్యులు, కార్మికులు, రైతులకు ఏమాత్రం ఉపయోగపడేలా కేంద్ర బడ్జెట్ లేదన్నారు. దేశంలో వ్యవసాయంపై 70శాతం ఆధారపడి జీవిస్తున్నారని, అయితే ఆ రంగానికి కేవలం 25 శాతం నిధులు కేటాయించడం శోచనీయమన్నారు. లేబర్ కోడ్లపై 5న నిర్వహించే ఆందోళనలో అన్ని వర్గాల అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో ఆసంఘ నాయకులు సత్యన్న, బాలరాజు,బాబు, రమేష్, నర్సన్న, చంద్రన్న, మారెప్ప పాల్గొన్నారు.

వైభవంగా గోపుర శిఖర కలశ ప్రతిష్ట





గోపుర కలశ ప్రతిష్టాపన చేస్తున్న పండితులు, మార్కండేయ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం భక్త మార్కండేయ స్వామి ఆలయ నూతన గర్భగుడి, ముఖద్వార గోపుర శిఖర కలశ ప్రతిష్టాపన భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జామున 4.30గంటలకు ఆదోనికి చెందిన వేదపండితులు గరుడాద్రి వెంకట సుబ్బయ్య శాస్త్రి, ఆలయ అర్చకులు వీరేష్ స్వామి నేతృత్వంలో శాస్త్రోక్తంగా వేదమంత్రాలు పఠిస్తుండగా గోపుర కలశ ప్రతిష్టాపన చేపట్టారు. ప్రాణప్రతిష్ట, కళన్యాసము, అరుణహోమము, ప్రతిష్టదేవతల మూల మంత్ర హోమము, బలిహరణము, పూర్ణాహుతి, కుంభాభిషేకం, తీర్థ ప్రసాద వినియోగము చేపట్టారు. నాలుగు రోజుల పాటు ఆలయంలో భక్తిశ్రద్ధలతో వివిధ రకాల హోమ పూజలు చేసి ఆదివారం కలశ స్థాపక పూజలకు ముగింపు పలికారు. కర్నూలు ఐఐఐటీ కళాశాల డీఎం రిజిస్టర్ కేతారి గురుమూర్తి, భక్తులు హోమ పూజలు చేపట్టారు. కలశ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వై.ఆంజనేయులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శాలువాతో సన్మానం చేసి స్వామి వారి మెమెంటోను అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నరసింహులు, ఇల్లూరి ఆదినారాయణ, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షులు జగదీష్ స్వామి, నాడుగేని నాగరాజు, మంగమ్మ, భీమక్క ఉన్నారు. కార్యక్రమంలో కోసిగి మండల పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు రిటైర్డ్ డీఎంహెచ్ఈఓ నరసింహులు, జేరుబండి నరసింహులు, డాక్టర్ లక్ష్మన్న, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



హోమం పూజల్లో పాల్గొన్న కర్నూలు ఐఐఐటీ కళాశాల డీఎం రిజిస్టర్ కేతారి గురుమూర్తి